క్లుప్తంగా

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



అట్టలి గ్రామంలో కాలువల్లోని పూడికలు తీస్తున్న కూలీలు

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ, సంకిలి, లుంబూరు, ఓని, అట్టలి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. వీధులు, రోడ్లపై చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు కాలువల్లోని మురుగు, పూడికలు తొలగిస్తున్నారు.

ఉపాధి పనుల లక్ష్యాలు చేరుకోవాలి



ఉపాధి హామీ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: ఉపాధి హామీ పనుల లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీఓ దొంక త్రినాథులు సూచించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో బుధవారం సమావేశమైన ఆయన వేతనదారులందరికీ పనులు కల్పించాలని, పనులు సక్రమంగా జరిగేలా, వేతనదారులకు గిట్టుబాటు వేతనం వచ్చేలా చూడాలన్నారు. అంతకు ముందు లేబర్ కంపోనెంట్, వేజ్ కంపోనెంట్ పెంపుదలపై పంచాయతీల వారీగా సమీక్షించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, మంచిపేరు తెచ్చుకోవాలన్నారు.

బాక్సింగ్ విజేతలకు అభినందనలు



భామిని: జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల విజేతలతో ప్రిన్సిపాల్, సిబ్బంది

భామిని: జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన భామిని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పీఈటీ శివరాంప్రసాద్, కోచ్ కె.సోమేష్ బుధవారం అభినందించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో వి.రాజేష్, ఎస్.కె.శాంతి, వి.హారిక, సాయి నిశాంత్, పి.సాయిలక్ష్మిలు స్వర్ణ పతకాలు, కె.జశ్వంత్, సాయి నిఖిల్, ఎస్.జ్ఞానేశ్వరి, జి.స్పందన రజత పతకాలు, వి.దివాకర్, ఎ.జశ్వంత్, పి.సాయిగణేశ్ కాంస్య పతకాలు సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని సిబ్బంది తెలిపారు.

108లో ప్రసవం



108 అంబులెన్స్‌లో తల్లీబిడ్డను తరలిస్తున్న దృశ్యం

సీతంపేట: మండలంలోని గోలుకుప్ప గ్రామానికి చెందిన నిండుగర్భిణి సవర సరోజిని 108 అంబులెన్స్‌లో బుధవారం ప్రసవించింది. వేకువజామున పురిటినొప్పులతో బాధపడుతున్న ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు 108కి కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో ఆమెను తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్

కొమరాడ: ఉద్యోగులంతా సమయ పాలన పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన సచివాలయ సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దన్నారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. సచివాలయాల్లో సేవలు మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.వి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు..



భామిని: కాట్రగడ-బి పాఠశాలలో వేసి భోగి మంట వద్ద సంప్రదాయ నృత్యాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది



పాలకొండ రూరల్: సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన విద్యార్థులు



పాలకొండ రూరల్: ఆకట్టుకున్న విద్యార్థుల డూడూ బసవన్న వేషధారణ



పాలకొండ రూరల్: సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినుల ఆటపాట



పాలకొండ రూరల్: పాఠశాలలో భోగి పండగ చేసుకుంటున్న దృశ్యం

సంక్రాంతి ముందస్తు సంబరాలు పాలకొండ మండలంలోని ఓని గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణల్లో మెరిసి, పండగ వాతావరణం తీసుకువచ్చారు. మరికొంతమంది విద్యార్థులు వేసిన హరిదాసు, డూడు బసవన్నల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉదయం భోగి మంటలు వేసి, మధ్యాహ్నం పతంగులు ఎగురవేసి, ఆటపాటలతో సరదాగా గడిపారు. ప్రధానోపాధ్యాయురాలు బి.నాగమణి, ఉపాధ్యాయులు జి.సూర్యనారాయణ, జి.మోహనరావు, పి.శారదాకుమారి, ఉమామహేశ్వరి కార్యక్రమాలు పర్యవేక్షించారు. భామిని మండలంలోని కాట్రగడ–బి గ్రామ పాఠశాలలో కూడా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్

ప్రతి ఇంటా 'సంక్షేమ' కాంతులు

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నెలకొన్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. బుధవారం స్థానిక పట్టణంలోని సచివాలయం-1, 3, 4 పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆయా నేతలు ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క ప్రభుత్వ పథకం కావాలన్నా, ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని రాజకీయ నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత అటువంటి పరిస్థితి లేదన్నారు. ఏ ఒక్క పథకం కావాలన్నా, ఏ ఒక్క సమస్య పరిష్కారం కావాలన్నా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే న్యాయం చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలనలో సరికొత్త సంస్కరణలు తీసుకువస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పులిటి గౌరమ్మ, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు, ఎంపీటీసీ మంతిని హేమలత, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కళింగ ప్రేమభూషణరావు, పాలవలస దవలేశ్వరరావు, భోగి మణి, శంబాన శ్రీను, శైల సుహాష్, చుక్కా శ్రీను, పిన్నింటి శ్రీను, బూరాడ చిన్న, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఔదార్యం



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: స్థానిక ఆర్‌సీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం విద్యాసామగ్రి వితరణ చేసి, ఔదార్యం చాటుకున్నారు. ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు జగనన్న విద్యాకానుకకు అర్హులు కారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన సొంత డబ్బులతో నోటుపుస్తకాలు, అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు.

ఇంటింటికీ తాగునీరు కల్పించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



రక్షిత మంచినీటి పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

జియ్యమ్మవలస: ప్రతీ గ్రామంలో ఇంటింటికీ తాగునీటి వసతి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని అంకవరం గ్రామంలో రూ.42 లక్షల నిధుల వ్యయంతో కొత్తగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి కొరత ఉండకూడదన్న ప్రధాన ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు నిర్మించడం, తాగునీటి బోర్లు, చెరువులను బాగు చేయించడం చేస్తోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శశికళ, మండల పార్టీ అధ్యక్షుడు గౌరిశంకరరావు, మండల మహిళా అధ్యక్షురాలు ఉషారాణి, సర్పంచ్ అలజింగి నారాయణరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై ఆరా



అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలిస్తున్న రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రవిచంద్ర

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లబ్ధిదారులకే పథకాలు వచ్చేలా అధికారులు చర్యలు చేపడుతున్నారా అనే విషయం అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇస్తున్న పౌష్టికాహారం పంపిణీని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారినపడకుండా చూడాలని, చిన్నారుల బరువు క్రమం తప్పకుండా తూయాలని సిబ్బందికి తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాల, హెల్త్ సెంటర్‌ను సందర్శించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, ఐసీడీఎస్ పీడీ గౌరీదేవి, సీడీపీఓ గీత తదితరులు ఉన్నారు.

200 సారా ప్యాకెట్ల స్వాధీనం

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామ శివారులో ఓ వ్యక్తి నుంచి 200 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జగదీష్‌నాయుడు బుధవారం తెలిపారు. అలాగే పెదశాఖ గ్రామంలో మరో వ్యక్తి దగ్గర నుంచి 20 లీటర్ల సారా గుర్తించి, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రుణాల రికవరీ వేగవంతం చేయాలి

భామిని: ఎస్‌హెచ్‌జీకు ఇచ్చిన రుణాల రికవరీని వేగవంతం చేయాలని వెలుగు ఏపీఎం దొడ్ల భవాని సూచించారు. బుధవారం మండలంలోని మనుకొండ గ్రామైక్య సంఘ కార్యాలయంలో స్వయం సహాయక గ్రూపులతో సమావేశమైన ఆమె శ్రీనిధి రుణాలు విధిగా వసూలు చేయాలన్నారు. రుణాల రికవరీ జరిగితేనే మరో సంఘానికి ఆర్థికసాయం చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీసీ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగుపై రైతుల ఆసక్తి



పెద్దూరులో వేసిన పెసర పంట

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పెసర, మినుము వంటి అపరాల పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. వరి కోతల అనంతరం వాతావరణం అనుకూలంగా ఉండడంతో చాలాచోట్ల వేసిన పెసర, మినుము పంటలు ఆశాజనకంగా ఉన్నాయి.

కిక్కిరిసిన వారపు సంత



జనాలతో కిక్కిరిసిన వారపు సంత

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో బుధవారం జరిగిన వారపు సంత జనాలతో కిక్కిరిసింది. సంక్రాంతి పురస్కరించుకుని, పూజ, ఇతర సామగ్రి కొనుగోలు కోసం జనాలు ఒక్కసారిగా సంతకు పోటెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది.

గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం సందర్శించిన డీఎస్‌డీఓ



గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం సందర్శిస్తున్న డీఎస్‌డీఓ

సీతంపేట: స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంను శ్రీకాకుళం డీఎస్‌డీఓ పి.మాధురీలత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ కొత్తగా నిర్మించిన కబడ్డీ, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులు, ఫ్లడ్‌లైట్లు, జిమ్‌ను పరిశీలించారు. మంచి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఐటీడీఏ పీఓ బి.నవ్యను కలిసి, పలు క్రీడాంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎస్.జాకాబ్ దయానంద్, కబడ్డీ కోచ్ హరి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు



పని ప్రదేశంలో వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

కొమరాడ: మండలంలోని చోళ్లపథం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ రామచంద్రరావు బుధవారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. కనీసం రోజుకు రూ.250 తగ్గకుండా వస్తుందన్నారు. పని ప్రదేశంలో టెంట్, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ బాలకృష్ణ తదిరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.పైడితల్లి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి పనులు చేసుకుని, జీవనం సాగించాలన్నారు. ఆమె వెంట ఏపీఓ టి.రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీకి టెండర్లు



టెండర్లు నిర్వహిస్తున్న ఐటీడీఏ పీఓ నవ్య

సీతంపేట: స్థానిక ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు 35 రకాల నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి, బుధవారం టెండర్లు నిర్వహించారు. ఐటీడీఏ పీఓ బి.నవ్య సమక్షంలో చేపట్టిన టెండర్లకు మొత్తం 8 మంది హాజరయ్యారు. తక్కువ ధరకు టెండర్లు కోడ్ చేసిన వారికి ఖరారు చేశారు. కార్యక్రమంలో జీసీసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ బి.నగేష్, ఓఎస్‌డీ యుగంధర్, సీతంపేట, పాతపట్నం జీసీసీ బ్రాంచ్ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కొమరాడ: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సమస్య పరిష్కారానికి ఆ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎ.గణపతి, పి.బీమయ్య కలిసి ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల కొత్త కార్యవర్గం ఏర్పాటు జరిగింది.

కత్తెర పురుగు నివారణకు చర్యలు



అలజంగిలో మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు రైతులు కృషి చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్ సూచించారు. మండలంలో అలజంగిలో మొక్కజొన్న పంటను బుధవారం పరిశీలించిన ఆయన పంటకు కత్తెరపురుగు పట్టడం గుర్తించారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100గ్రాములు, 500ఎంఎల్ వేపనూనెకు కలిపి ఎకరాకు 12ట్యాంకులు పిచికారీ చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో రైతులు పంటలో నీరు చేరకుండా చూడాలని, అదేవిధంగా రెండో విడత ఎరువు కింద ఒకఎకరాకు 50కేజీల యూరియా, 25కేజీల మ్యూరేట్ ఆఫ్ పటాస్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు పైల వేణు, వ్యవసాయ సహాయకురాలు పెంట లత పాల్గొన్నారు.

ఎంపీడీఓ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.రమేష్ బుధవారం సందర్శించారు. అనంతరం ఆయన అక్కడి రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయానికి విధులు హాజరై, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పుర్లి గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి, నిమోనియా వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాలవలస సూర్యారావు, షర్మిల, యోగా ఇన్‌స్ట్రక్టర్లు రామకృష్ణ, శైలజ, ఏఎన్‌ఎం రాంబాయి పాల్గొన్నారు.